# సనాతన ధర్మం

సనాతన ధర్మ ప్రచారానికి మన దేశంలో అనేక పీఠాలు కంకణం కట్టుకొని అహర్నిశలు పాటుపడుతున్నాయి. పీఠాలలో నియమాలు చాలా కఠినంగా యుంటాయి. శృంగేరి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ భారతీ తీర్థ స్వామివి రోజూ అనుగ్రహ భాషణాలు లభిస్తుంటాయి. ఒకసారి అనుగ్రహ భాషణం వారిమాటలలోనే "నీవు సంధ్యావందనం రెండు గంటలు, 3 గంటలూ చేయలేకపోయినా, ఒక్క గంట చేయి. ఒక్క గంట కూడా కుదరదంటావా, అర్ధ గంట చేయి. అంత చేయడానికి కూడా సమయం లేదంటావా, ఒక్క పది నిమిషాలు చెయ్యి. సంధ్యావందనం చేయడానికి పది నిమిషాలు సమయం లేదని ఎల్లా చెబుతావు ? ఎగ్గొట్టడానికి కారణాలు అనేకం ఉంటాయి. పేపరు చదవడానికి సమయం ఉంది. టీవి చూడడానికి సమయం ఉంది. ఇతరులతో బాతాఖానీ కొట్టడానికి సమయం ఉంది. సంధ్యావందనం చేయడానికి 10 నిమిషాల సమయం లేదని అంటే ఎవరూ హర్షించరు. సంధ్యావందనం చేస్తే అది నీకు శ్రేయస్సు- - -" ఇలా సాగుతుంది, వారి ప్రసంగం. ద్విజులు కానివారికి ధ్యానం లేక దైవ ప్రార్థన అని మనం అర్థం చేసుకోవాలి. ఈ ధ్యానం మానసికంగా చేస్తే ఉత్తమం. దీనికి సమయం సందర్భం అవసరం లేదు. ఇది నిరంతర ప్రక్రియ. అష్టావధానంలో అవధాని ఒకేసారి ఎనిమిది ప్రక్రియలు చేయగా లేనిది మనం రెండు ప్రక్రియలు చేయలేమా ? మనం ఏ పని చేస్తున్నా, మనసు ఎల్లప్పడూ భగవంతుని మీద కేంద్రీకరించగలగాలి. నిరంతర భక్తి గురించి భాగవతంలో మనకు కనిపిస్తుంది. రాక్షస రాజు హిరణ్య కశిపుడు విష్ణు భక్తు డయిన తన తనయుని ఎన్ని విధాల బాధలు పెట్టినా ప్రహ్లాదుడు హరిభక్తిని మానలేదు.

పానీయంబులు త్రావుచున్ కుడుచుచున్ భాషించుచున్ హాసలీ
లానిద్రాదులు సేయుచున్ తిరుగుచున్ లక్షింపుచున్ సంతత
శ్రీ నారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం
ధానుండై మరచెన్ సురారి సుతుడేతద్విశ్వమున్ భూవరా!!

ప్రహ్లాదుడు ఒక చోట స్థిరంగా కూర్చొని తపస్సు చేసినట్లు మనకు కనపడదు. ప్రతీ క్షణం కూడా హృదయంలో హరి భక్తి నింపుకొని తన్మయుడవుతూంటాడు. ఇదే మనకి కావలసింది.

అనన్యా శ్చింతయంతో మాం ఏ జనాః పర్యుపాసతే

తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్——9-22

శ్రీ భగవద్గీత — తొమ్మిదవ అధ్యాయము — ''రాజ్యవిద్యా రాజగుహ్య యోగము'' లో స్వయంగా పరమాత్మ ప్రకటించినది. రాజ్యవిద్య యనగా విద్యాలలో కెల్ల శ్రేష్ఠమైనది యని, రాజగుహ్య మనగా రహస్యములలో కెల్లా పరమ రహస్యమైనదనియు అర్ధము.

ఎవరు ఇతరభావములు లేనివారయి నన్ను గూర్చి చింతించుచూ ఏడతెగక ధ్యానించు చున్నారో, ఎల్లప్పుడూ నా యందే నిష్ఠ గల్గి యుందురో అట్టి వారి యోగక్షేమములను నేనే వహించుచున్నాను.

అన్యము లేనిది అనన్యము. అనగా భగవంతుడు తప్ప అన్యమగు ఏదియు లేనివారని అర్ధము. లేక, పరమాత్మయందు తప్ప తక్కిన దేనియందును మనస్సును పోనీయక యుండువారని భావము. ఎవరు ఇతర భావములు లేనివారై నన్ను గూర్చి చింతించుచు ఎడతెగక ధ్యానించుచున్నారో, ఎల్లప్పుడూ నాయందే నిష్ఠగలగియున్నారో నట్టివారియొక్క యోగక్షేమములను నేను వహించుచున్నాను. ఇది పరమాత్మ యొక్క అభయం.

సాధన చేయనిచో ఏదియు లభించదు. సాధన దేనిగురించి చేయాలి? ఏది లభిస్తే మరి యేదీ అవసరము లేదో అది. అదే బ్రహ్మ సాక్షాత్కారం. అందుకు సాధన నిరంతరం చేయాలి. దైవమును గూర్చియే చింతించుట, ఆయనను గూర్చియే చెప్పుట, ఆయనను గూర్చియే పరస్పరము సంభాషించుట, ఆయననే ధ్యానించుట మొదలగు క్రియలద్వారా అచిర కాలముననే పరమాత్మను చేరగలుగుతాము. డా. వి. యస్. శాస్త్రి, మానేజింగ్ ఎడిటర్.